
# ధన్యజీవి!

ఎం.డి.యుసుద్దీన్



**మంజూష నోటి వెంట ఆ మాట వింటూనే పార్కులో చుట్టూ జనాలున్నారన్న సంగతి కూడా పట్టించుకోకుండా ఆమెను అమాంతం గాల్లో ఎత్తి గిరగిరా తిప్పి వదిలాడు శ్రీచరణ్.**

మెడికల్ కాలేజీలో క్లాస్‌మేట్స్ అయిన వాళ్ళిద్దరు స్నేహితుల నుండి ప్రేమికులుగా మారి చాలకాలం అయింది. ఇద్దరి ట్రైనింగ్ కూడా పూర్తి అయింది. ఇక పెళ్ళికి పెద్దల అనుమతి కావాలి. అందుకు శ్రీచరణ్ అమ్మగారి నుంచి ఏ ప్రాబ్లంలేదు.

మంజూషది ఉదయగిరి పక్కన పల్లెటూరు. ఆమె చదువు నిమిత్తం ఇక్కడకు వచ్చి హాస్టల్‌లో వుండి చదువుతూ ట్రైనింగూ పూర్తి చేసింది. శ్రీచరణ్‌తో పరిచయం ప్రేమగా మారాక ఆమె అప్పుడప్పుడూ శ్రీచరణ్ వాళ్ళ ఇంటికి వెళ్ళేది.

శ్రీచరణ్ వాళ్ళ నాన్నగారు చాలాకాలం కిందటే కాలధర్మం చెందారు. అప్పటి నుంచి వాళ్ళ అమ్మ శ్రీవల్లి వాళ్ళ వ్యాపార లావాదేవీలు చూసుకుంటూ ఆర్థికంగా మంచి ఎదుగుదలను సాధించింది.

ప్రతి విషయాన్ని కమర్షియల్‌గా ఆలోచించే ఆమెకు మంజూషను తమ ఇంటి కోడల్ని చేసుకోవడంలో లాభమే తప్ప నష్టం కనిపించలేదు. భార్యాభర్తలు ఇద్దరూ డాక్టర్లే అయితే రెండు చేతులా సంపాదిస్తారు అని ఆమె ప్లాను.

కానీ మంజూష వాళ్ళ నాన్న పరంధామయ్య ఆలోచన వేరు. చాల చిన్న పల్లెటూరు అయినా వాళ్ళ వూరిలో సరైన వైద్యం దొరకదు. ఆ కారణంగానే మంజూష తల్లి చనిపోయింది. అందుకే అతను పట్టదలగా తన కూతుర్ని మెడిసిన్ చదివించాడు.

మంజూష డాక్టరు అయినాక తమ వూర్లోనే హాస్పిటల్ పెట్టించాలని ఆయన కోరిక. తన ప్రేమ విషయం మంజూష ఆయన్తో చెప్పగానే శ్రీచరణ్‌తో పెళ్ళికి అంగీకరించాడు. అయితే వాళ్ళు హాస్పిటల్‌ను ఇక్కడే పెట్టాలని షరతు పెట్టాడు.

పెళ్ళికి అంగీకరించాడనే విషయం ఆమె శ్రీచరణ్‌కు చెప్పింది. కానీ ఆ షరతు విషయం చెప్పలేదు. చెబితే ఇప్పుడు అతని ముఖంలో కనిపిస్తున్న సంతోషం సగమైనా ఉంటుందా? అని ఆమె ఆలోచిస్తోంది.

"ఏం మంజూ! ఇంత సంతోషకరమైన వార్త చెప్పి అంత డల్‌గా వున్నావేమిటి? కమాన్ లెటజ్ సెలబ్రేట్" అంటూ ఆమె చేతినందుకుని పక్కనే వున్న రెస్టారెంట్‌కు పిల్చుకెళ్ళి ఏవేవో ఐటమ్స్‌ను ఆర్డరిచ్చాడతను.

అతనికి ఎదురుగా కూర్చున్న మంజూష భావరహితంగా శూన్యంలో చూస్తూ ఏదో ఆలోచిస్తోంది.

"మన పెళ్ళయ్యాక హనీమూన్‌కు ఎక్కడకు వెళ్దామా అని ఆలోచిస్తున్నావా?" ఆమె ముఖం ముందు చిటికేస్తూ అడిగాడతను.

ఆమె తేరుకుని అతని వైపు చూసి చిన్నగా నవ్వింది. ఆ చిరునవ్వంటే అతనికెంతో ఇష్టం. ఆమెవైపు అలాగే చూస్తుండిపోయాడు రెండు నిమిషాల తరువాత –

"శ్రీ! ఒకమాట అడుగుతాను నిజాయితీగా సమాధానం చెబుతావా?" అడిగింది.

"ఒక్కటేమిటీ? వందడుగు" ఉత్సాహంగా అన్నాడు.

"ప్రతి వ్యక్తికీ సామాజికంగా కొన్ని బాధ్యతలుంటాయి. డాక్టర్లను దేవుడితో పోల్చుతారు కాబట్టి సామాన్య వ్యక్తులకంటే ఆ బాధ్యత మనమీద ఇంకా ఎక్కువ వుంటుంది ఏమంటావు?"

"అక్షరాల నిజమంటాను"

"మరీ మనం ఇక్కడ పెట్టాలనుకుంటున్న హాస్పిటల్‌ను మా వూర్లో పెడితే ఆ పల్లెజనాలకు ఎంతో సేవచేసినట్టు వుంటుంది, మన బాధ్యతను సక్రమంగా నిర్వహించనట్లూ వుంటుంది కదా?"

ఆ మాటతో అదిరిపడ్డాడతను. అతనిలో ఉప్పొంగుతున్న ఉత్సాహాన్ని నీళ్ళుజల్లినట్లు అనిపించాయి ఆమె మాటలు. ఆమె ఇలా ఇరుకున పెడుతుందని అతను అసలు ఊహించలేదు. ఇబ్బందిగా కదిలి బలవంతంగా చిరునవ్వు నవ్వి –

"అదేదో మనం హాస్పిటల్‌ను ఇక్కడ పెట్టి

సేవచేయవచ్చు కదా? వైద్యసేవ ఇక్కడివాళ్ళకు చేసినా అక్కడి వాళ్ళకు చేసినా ఒక్కటేకదా?" అన్నాడు.

"ఇక్కడ లెక్కకు మిక్కిలిగా పెద్దపెద్ద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ వున్నాయిగా" అతని వైపు ఆశగా చూస్తూ అందామె.

"మన హాస్పిటల్ ప్రారంభోత్సవం మన జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రిగారి చేత మమ్మి ప్రారంభించాలనుకుంటోంది. అదే జరిగితే మనకు బోలెడంత పబ్లిసిటీ వచ్చేస్తుంది. దాంతో మన హాస్పిటల్ జిల్లాలోనే నెంబర్ వన్ అయిపోతుంది చూస్తుండు" గర్వంగా ఆమె వైపు చూస్తూ అన్నాడతను.

"శ్రీ! నేను చెప్పేది నీకు అర్థం కావడంలేదు. పల్లెలతో పోల్చుకుంటే ఇక్కడి జనాలకు ఎంతో మెరుగైన వైద్యం అందు తోంది. చదువుకున్న అందరూ పట్టణాలనే పట్టుకుని వేలాడితే పల్లెలు ఏమైపోవాలి? కాస్త నిదానంగా ఆలోచించు. మన అవసరం ఇక్కడివారి కంటే మా వూరివారికే ఎక్కువ. అవసరం వున్నచోట మనం ఉపయోగపడాలే కానీ అంతగా అవసరం లేని చోట మంత్రిగారి చేత ప్రారంభించినా గవర్నరుగారి చేత ప్రారం భించినా లాభం ఏముంటుంది చెప్పు?"

అతను కొద్దిసేపు మౌనంగా ఉండిపో యాడు. తరువాత తేరుకుని –

"మంజూ! నాకు తెలిసి మీ వూర్లో రెండు వేలకు మించని ఇళ్ళు, అయిదు నుంచీ ఆరు వేల వరకూ జనాభా ఉండొచ్చు. అందులో డాక్టర్ల ఫీజు కూడా చెల్లించలేని స్థితిలో దాదాపు సగం మంది ఉంటారు. మిగిలిన సగం మందిలో ఎట్‌లీస్ట్ టెన్ పర్సెంట్ కూడా మన స్థాయికి తగ్గట్లు ఫీజులు ఇచ్చుకోలేరు. సో, మొత్తం మీద చూస్తే మీ వూరి జనాభాలో రెండు వందల యాభై నుంచి మూడు వందల లోపు జనం మనదగ్గర వైద్యం కోసం వచ్చే స్థితిలో ఉన్నట్లు. మరీ ఆ మాత్రం దానికి మనం అక్కడ హాస్పిటల్ పెట్టడం అవసరమంటావా?"

"వాళ్ళు ఇచ్చే ఫీజుల మీదే మనం ఆధారపడి బ్రతికేటంతటి హీనస్థితిలో మనం ఉన్నామా శ్రీ?"

"మనం ఆలోచించాల్సింది అదికాదు మంజు! మనం ఇంత కష్టపడి చదివాము. మన పెద్దలు మన మీద ఎంతో నమ్మకంతో, ఆశతో చాలా డబ్బు ఖర్చు చేశారు. శ్రమా ప్లస్ పెట్టుబడి పెట్టి దానికి తగ్గ ప్రతిఫలం ఆశిచడంలో తప్పేముంది?"


"పెట్టుబడికి తగ్గ ప్రతిఫలం ఆశించేదానికి ఇది బిజినెస్‌కాదు శ్రీ! పల్లెలు పచ్చగా వుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు గాంధీగారు. అవి పచ్చగా ఉండాలంటే ముందు అక్కడి ప్రజలు ఆరోగ్యంగా ఉండటం ముఖ్యం. వాళ్ళ ఆరోగ్యాలు కాపాడటం డాక్టర్లుగానే కాదు ఈ దేశ హితం కోరే పౌరులుగా కూడా మన ధర్మం."

ఆమె మాటలకు కొద్దిగా మెత్తబడ్డాడతను. అలాగని ఆమె ప్రపోజల్‌ను ఒప్పుకోలేదు. చాలాసేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చి "సరే ముందు మమ్మీకి చెబుదాం పద" అన్నాడు.

అప్పటికి ఆమె మనసు కాస్త కుదుటపడింది. "థ్యాంక్యూ శ్రీ! థ్యాంక్యూ వెరీమచ్!!" అంటూ అతని చేతినందుకుని చిరుముద్దు ఇచ్చింది. ఇక బంతి శ్రీవల్లి కోర్టులో వుంది.

"ఆంటీ! మంచిరోజు చూసుకుని నాన్నగారు మీతో వచ్చి

## ఎన్నికల చిత్రాలు





## అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**7.3.2004 ఆదివారం ఉదయం 10.30 గం॥లకు చెన్నై కొరుకుపేట నాగప్ప నగర్‌లో 'జనని' ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది.**

**కార్యక్రమానికి చెన్నై భారతి మహిళా కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డా॥ నిర్మలా పళనివేలు అధ్యక్షత వహించారు. శ్రీ కన్యకా పరమేశ్వరి ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల తెలుగు ఉపన్యాసకులు డా॥ టి.మోహనశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.**

**దుర్గా ట్రేడర్స్ అధినేత కందిమళ్ళ వెంకటేశ్వర్లు నాగప్ప నగర్ రాత్రి పాఠశాల ఉపయోగార్థం ఒక ఫ్యానును బహూకరించారు. మదరాసు తెలుగు అభ్యుదయ సమాజం వ్యవస్థాపక కార్యదర్శి పేరిశెట్ల భాస్కరుడు ప్రసంగించిన ఈ సభకు 'జనని' ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య స్వాగత వచనాలు పలుకగా నాగప్ప నగర్ రాత్రి పాఠశాల నిర్వాహకులు మందల కృష్ణయ్య వందన సమర్పణ చేశారు.**

మాట్లాడుతానన్నారు. కానీ..” అంటూ ఆగింది మంజూష.

“ఫరవాలేదు చెప్పమ్మా! ఇంకా ఏమన్నారు?” అడిగింది శ్రీచరణ్ వాళ్ళ అమ్మ శ్రీవల్లి.

“ఆంటీ! మీరు పెద్దవారు. జీవితం పట్లా, సమాజం పట్లా నాకంటే ఎక్కువ అవగాహన వున్నవాళ్ళు. అందుకే నా ఆవేదనను మీతో చెబుతున్నాను. జిల్లా కేంద్రం నుంచి మా వూరు దాదాపు వంద కిలోమీటర్ల దూరంలో వుంది.

నా చిన్నతనంలోనే మా అమ్మ చనిపోయింది. జబ్బు అంత తీవ్రమైనది కాకపోయినా సరైన సమయానికి సక్రమమైన వైద్యం అందక ఆమె మాకు కాకుండాపోయింది.

రూరల్ గ్రామాల సంగతి వేరు. అవి పట్టణాలకు దగ్గరలోనే వుంటాయి కాబట్టి పెద్దగా ఇబ్బంది వుండదు. మా వూరిలాగా పట్టణాలకు చాలా దూరంలో వుండే గ్రామస్థుల ఇబ్బందులు వర్ణనాతీతం.

అటు ప్రభుత్వం కానీ ఇటు ప్రయివేటు సంస్థలు కానీ సరిగ్గా పట్టించుకోకపోవడం వల్ల ఇప్పటికీ ఎన్నో గ్రామాలు మంచి వైద్యానికి నోచుకోక అవస్థలు పడుతూ ఉన్నాయి. ఎంతో మంది ప్రజలు కలరా, మసూచి లాంటి వ్యాధులబారిన పడి తమ ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రయాణ సదుపాయాలు కూడా అంతంత మాత్రమే. ఏ ఆరోగ్య సమస్య వచ్చినా అది ఎంత రాత్రి అయినా పట్టణానికి పరుగులు పెట్టాలి. అష్టకష్టాలుపడి వాళ్ళు ఇక్కడి హాస్పిటల్‌కు చేరుకున్నా అప్పటికే ఆలస్యం అయిపోయిందంటూ చాలా కేసుల్లో డాక్టర్లు పెదవి విరిచేస్తుంటారు.

ఇలాంటి అభాగ్యులను కొందరినైనా ఆదుకోవాలనే సదుద్దేశంతో మా నాన్నగారు పట్టుదలగా నన్ను మెడిసిన్ చదివించారు. ఇప్పుడు మా పెళ్ళికి ఆయన సంతోషంగా ఒప్పుకున్నారు. కానీ హాస్పిటల్‌ను మాత్రం మా వూర్లోనే పెట్టాలన్నారు.”

“అందుకు నువ్వు ఏమన్నావు?” అడిగింది శ్రీవల్లి.

“ఒక మంచిపని కోసం పాటుపడుతున్న ఆయన కోరికను మన్నించడం నా బాధ్యత. అయినా మీ ఇద్దరినీ సంప్రదించి ఏ విషయం చెబుతానని చెప్పాను”

“మంజూ! మా వాడికి నలభై లక్షలు ఇస్తామనీ యాభై లక్షలు ఇస్తామనీ సంబంధాలు వస్తున్నాయి. వాళ్ళను కాదని నేను నీవైపు మొగ్గు చూపించినదానికి మొదటి కారణం వాడు నిన్ను ప్రేమించడం, అయితే రెండోది నువ్వు డాక్టర్‌వి అవ్వడం.

మీ నాన్నకు మీ వూర్లో హాస్పిటల్ పెట్టాలని ఎంత కోరికగా వుందో అదే పని నాకు ఇక్కడ చేయాలని వుంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలే పల్లెల గురించి పట్టించుకోనప్పుడు మనం ఎందుకు పాటుపడాలి?

ఇది కమర్షియల్ యుగం. ఇక్కడ మనం మన టాలెంట్‌ను డబ్బు రూపంలో మార్చుకునే అవకాశం ఎక్కడ ఎక్కువ వుందో ఆలోచించాలి. అది పల్లెలలో కంటే పట్టణాలలోనే ఎక్కువ. మీ నాన్న సరే ఇంకా పాతకాలం ఆలోచనలతోనే వున్నారు. నువ్వూ అలాగే ఆలోచించి నీ భవిష్యత్తును పాడుచేసుకోకు.

మీ నాన్నగారి మాటకు కట్టుబడతానంటే ఈ ఇంటి కోడలివి కాలేవు. ఆయన్ను కాదని వచ్చేసినా నేను మీ పెళ్ళి జరిపిస్తాను. ఇది నీ జీవితానికి సంబంధించిన విషయం కాబట్టి బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో.

నీకు తెలుసుకదా! మేము చేసేది ఫైనాన్స్ బిజినెస్. ఇక్కడ రూపాయి పెట్టుబడి పెడితే ఎంత ఆదాయం వస్తుందని మేము ఆలోచిస్తాము. ఆ విషయం మాత్రం నువ్వు గుర్తుపెట్టుకో. ఇది నా కోసం కాదు. మీ ఇద్దరి మంచి కోసం, రేపు మీకు పుట్టబోయే పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అనుభవంతో చెబుతున్నాను ఆలోచించి నీ నిర్ణయం చెప్పు”

ఆమె మాటలకు ఏం సమాధానం చెప్పాలో అర్థంకాక మౌనంగా అక్కడి నుంచి వచ్చేసింది మంజూష.

రెండు వారాల తరువాత మంజూష శ్రీచరణ్ వాళ్ళ ఇంటికి వచ్చింది. అప్పుడు శ్రీవల్లి ఇంట్లో లేదు. శ్రీచరణ్ ఒక్కడే వున్నాడు. ఆమెను చూసి ఆశ్చర్యంగా –

“మంజూ! ఏమైపోయావు? చెప్పాపెట్టకుండా వూరెళ్ళిపోయావు. ఎన్నిసార్లు ఫోన్‌లో ట్రై చేసినా దొరకలేదు. నేనే మీ వూరికి రావాలనుకుంటున్నాను” అన్నాడు.

ఆమె మౌనంగా సోఫాలో కూర్చుంది. ఆమెకెదురుగా కూర్చుంటూ “ఏమన్నారు మీ నాన్నగారు ఆయన్ను ఒప్పించే వుంటావులే. అందుకే ఇంత ఆలస్యం అయింది కదూ?” అడిగాడు.

ఆమె సమాధానం ఏమీ చెప్పకుండా తన

హ్యాండ్ బ్యాగులో నుంచి ఒక ఇన్విటేషన్ కార్డు తీసి అతని చేతికిచ్చింది.

"ఏమిటిది? మన వెడ్డింగ్ కార్డును కూడా సెలక్ట్ చేసేశావా?" అంటూ నవ్వుతూ దాన్ని ఓపెన్ చేసి చదివిన అతని ముఖంలో నవ్వు మంత్రం వేసినట్లు మాయమైపోయింది.

"నూతన ప్రారంభం కరుణామయి ఉచిత వైద్యశాల - శీతారామపురం" దాన్ని చదివిన అతని ముఖం రక్తం లేనట్టు పాలిపోయింది. "ఏమిటిదీ?" కోపంగా అడిగాడు.

"మా అమ్మగారి పేరు మీద నేను మా వూర్లో ఈ హాస్పిటల్ ప్రారంభించబోతున్నాను. ఆ పనుల్లో బిజీగా వుండటం వల్లే ఈ రెండు వారాలు రాలేకపోయాను. ప్రారంభించేది రాష్ట్రమంత్రివర్యులు కాదులే. సింపుల్‌గా మా నాన్నగారే ప్రారంభిస్తారు. నువ్వు తప్పకుండా రావాలి" శాంతంగా అందామె.

"నీకు పిచ్చికాని పట్టిందా? అక్కడ నువ్వు ప్రారంభిస్తే ఈ ఇంటి కోడలివి కాలేవంటూ మమ్మీ నీకు స్పష్టంగా చెప్పిందిగా?" ఆందోళనగా అడిగాడు.

ఆమె చిన్నగా నవ్వి "నాకు ఈ ఇంటి కోడలిగా కంటే మా వూరి డాక్టరమ్మగా వుంటేనే ఎక్కువ తృప్తి కలుగుతుందనిపించింది శ్రీ" అంది.

"మరి నా పరిస్థితి ఏమిటి? నువ్వు లేకుండా నేనేమైపోతానో అన్న ఆలోచన నీకు రాలేదా?"

"నేను కాకుంటే నీకు మరో భార్య దొరుకుతుంది శ్రీ. మీ అమ్మగారి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు మరో డాక్టరు కూడా దొరుకుతుంది. నేను నిన్నే కోరుకుని మీ అమ్మగారు చెప్పినట్టు నా వాళ్ళను వదులుకుని వచ్చేస్తే మా నాన్నగారికి మరో కూతురు దొరకదు. మా వూరి ప్రజలకు మరో డాక్టరు దొరకాలంటే ఇంకా ఎన్ని ఏళ్ళు పడుతుందో?"

"అయితే మీ నాన్నగారి ఆశయం కోసం నీ భవిష్యత్తునూ మీ వూరి ప్రజల కోసం మన ప్రేమనూ త్యాగం చేస్తున్నావన్నమాట? దేశం గురించీ సమాజం గురించీ లెక్చర్లు ఇచ్చే నీకు ఒక ప్రేమికురాలికి వుండాల్సిన బాధ్యత గురించి తెలియకపోవడం దురదృష్టం మంజు! నీ వరకు నువ్వు నీకు అనుకూలమైన నిర్ణయం తీసుకుని నన్ను బలిపశువును చేస్తున్నావు. ప్రేమకు నువ్వు ఇస్తున్న విలువ చాలా గొప్పది. ప్రేమకోసం రాజ్యాలను త్యాగం చేసిన వాళ్ళ గురించి విన్నాను కానీ వూరోళ్ళకోసం మనసు చంపుకుని ప్రేమను త్యాగం చేస్తున్నదాన్ని నిన్నే చూస్తున్నాను. రియల్లీ యు అర్ గ్రేట్!" వ్యంగ్యంగా అన్నాడు.

"మన మధ్య వుండేది నిజమైన ప్రేమే అయితే అది ఎప్పటికైనా నెగ్గే తీరుతుంది శ్రీ! ఎప్పుడో నా చిన్నప్పుడు మా అమ్మ చనిపోతే నన్ను కంటికి రెప్పలా కాపాడి పెంచిన మా నాన్నగారి ప్రేమకంటే మన ప్రేమ ఎక్కువని నేను అనుకోవడం లేదు."

"ఆ మాటకొస్తే మా మమ్మీ కూడా మా డాడి చనిపోయినా నన్ను ఎంతో జాగ్రత్తగా పెంచి నన్ను ఈ స్థితిలో నిలబెట్టింది. మన ప్రేమను పెద్ద మనసుతో ఆమోదించింది. అంత చేసిన ఆమె కోసం కొడుకుగా నేను ఆమె మాట వినాలిగా? మీ నాన్నగారి ఆశయం కోసం నువ్వు పట్టుబట్టినప్పుడు మా మమ్మీ మాటకు నేను కట్టుబడటం తప్పా?"

"స్వార్థానికీ నిస్వార్థానికీ, సదుద్దేశానికీ దురుద్దేశానికీ, సేవాదృక్పధానికీ బిజినెస్ మైండ్‌కూ చాలా తేడా ఉంటుంది శ్రీ! మనం ఆలోచించాల్సింది వాళ్ళ ఆశయం గురించి కాదు, ఆ ఆశయంలో నిజాయితీ ఎంత వుంద నేది!"

"మరైతే నన్నెందుకు ప్రేమించావు? పెళ్ళి పేరుతో ఎందుకు నాలో ఊహలు రేపావు?"

"ప్రేమ మనసులో నుంచి పుడుతుంది శ్రీ! అది మమతల తోడు కోరుకుంటుంది. అంతేకానీ ఎవర్ని ప్రేమిస్తే ఎక్కువ ఆదాయం వస్తుందో బేరీజు వేసుకుని ప్రేమిస్తే అది ప్రేమ ఎలా అవుతుంది?"

"అలాంటి లెక్కలు వేసుకునే నేను నిన్ను ప్రేమించానని నువ్వు అనుకుంటున్నావా?"

"అదంతా నాకు తెలియదు శ్రీ! యం.బి.బి.ఎస్. అర్థాన్ని మాస్టర్ ఆఫ్ బిజినెస్ అనుకుని నేడు చాలామంది డాక్టర్లు వైద్య రంగాన్ని కలుషితం చేస్తున్నారు. నువ్వూ వాళ్ళలో ఒకడివి అవుతానంటే నేను నీ భాగస్వామిని కాలేను"

"మీ వూరి వాళ్ళు నీకేమిచ్చారని నువ్వు నన్ను కూడా వద్దనుకుంటున్నావు?" కోపంగా అడిగాడు.

"దేశం మనకేమి ఇచ్చిందనేది కాదు ముఖ్యం. దేశానికి మనం ఏం ఇచ్చామన్నది ముఖ్యం అన్నారు స్వామి వివేకానంద. అలాంటి మహానుభావుల మాటలను గుర్తు చేసుకోవడమే కాదు ఆచరించి కూడా చూపించాలి."

"ఆచరించు. గొప్ప మదర్ థెరిస్సా అంత పేరు తెచ్చుకో. తరువాత ఒక్కసారి వెనక్కు తిరిగి చూసుకో. అప్పుడు తెలుస్తుంది. నువ్వు ఏం పోగొట్టుకున్నావో, ఎంత పోగొట్టుకున్నావో."

"ఫరవాలేదు శ్రీ! కమర్షియల్ లైఫ్ కంటే కైండ్‌నెస్ నిండిన లైఫ్ ఎంతో సంతృప్తి కరమైంది. నా దారిలో నేను వెళతాను. నీ దారిలో నువ్వు వెళ్ళు. తరువాత వెనక్కు తిరిగి చూసుకున్నప్పుడు నా దారిలో నువ్వు రావాలనుకుంటావో లేక నీ దారిలో నేను వస్తానో కాలమే సమాధానం చెబుతుంది."

అంటూ ఆమె అక్కడి నుంచి వెళ్ళిపోయింది. మంజూష వెళ్ళిన వైపు శిలాప్రతిమలా నిలబడి చూస్తుండిపోయాడు శ్రీచరణ్.

తమ ప్రేమను ఒకరిద్దరిపై పరిమితం చేసేవారు సాధారణ జీవులు. అందరికీ పంచేవాళ్ళు ధన్యజీవులు! ✱



## పుస్తకాలు

పుస్తకము : గాలిపల్లకి (కవితల కదంబము)
రచయిత్రి : ఉమ
మూల్యము : రూ. 50/-
పేజీలు : 81
ప్రతులకు: వి.కె. మోహన్
ఇతర రచనలు: తుహినకణాలు

గాలి పల్లకి సంకలనం. సాహిత్య రసపోషణం ఉమ కవితాలహరి హృదయాలకు హత్తుకునే భావాల ఝరి. గణన శీర్షికలు హరితపల్లవాలు. ఆమోదయోగ్యాలు. పాఠక లోకానికి హృదయస్పందనలు. గాలిపల్లకితో ప్రారంభించి సంఖ్యాకథనంతో ముగించారు. గరికవిపుళ్ళు, ఎదదివ్వెలు, తెలుగు వెలుగులు ఒకటేమిటి! కోకొల్లల ముత్యాల కవితలు. మీరు తరచి తరచి ఏరుకోవాల్సిందే. పూవు పుట్టుక, గాలి పల్లకికి అందాల మాలిక, ఉమ కవితారస ప్రదీపిక. కొంగొక్కడే నీది కొమ్మరో నేడు? జానపద కవిత. నాదఝురులు ప్రణయహేల రచయిత రచనా సౌష్ఠవమును ప్రస్ఫుటం చేయుచున్నది. 'సమర్పయామి' నూతన పంథాలో నడిచింది. సప్తస్వర ఝరి. సంగీత రసమాధురి. మొత్తం మీద ఉమగారి గాలిపల్లకి పాఠకలోకానికి ఊహల పల్లకి కాగలదు.

- విద్వాన్ కో॥శ్రీ॥